




# కరపత్రం

SINCE 2014

శనివారం నవంబర్ 30 2024 | సంపుటి :0 | సంచిక : 52 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## సోనియా ఇవ్వకపోతే తెలంగాణ వచ్చేదా..? భారాస ఆత్మవిమర్శ చేసుకోవాలి: మంత్రి పొన్నం

**తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ పట్ల కృతజ్ఞతతో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.**



హనుమకొండ: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ పట్ల కృతజ్ఞతతో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఆయన పర్యటించారు. కొత్త కొండ వీరభద్రస్వామిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. సోనియా గాంధీ ఇవ్వకపోతే తెలంగాణ ఏర్పడేదా అని భారాస ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.

“తెలంగాణ సాధనకు ఎందరో బలిదానం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా పార్లమెంటులో ఆనాడు తెలంగాణ బిల్లు పెట్టారు. తల్లిని చంపి బిడ్డను ఎత్తుకుపోయారని ప్రధాని మోదీ ఆరోపించారు. ప్రధాని వ్యాఖ్యలపై భాజపా నేతలు ఎందుకు మాట్లాడట్లేదు. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో ఎందుకు వివక్ష చూపిస్తున్నారు” అని పొన్నం విమర్శించారు.

## మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానం: మంత్రి శ్రీధర్‌బాబు



- రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ఇజ్రాయెల్ ముందుకు రావడం పట్ల రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.

2లో

# లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరణ

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వికారాబాద్ జిల్లా లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంది.
- ఫార్మా విలేజ్‌ల కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.
- లగచర్లలోని 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది.
- ఆగస్టు 1న తెలంగాణ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.




### లగచర్లలో ఏం జరిగిందంటే?

ఔషధ(ఫార్మా) పరిశ్రమల ఏర్పాటుకు స్థలసేకరణ నిమిత్తం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో నిర్వహించ తలపెట్టిన గ్రామసభ రణరంగాన్ని తలపించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. భూసేకరణకు వ్యతిరేకంగా స్థానిక రైతులు గత కొంతకాలంగా నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాభిప్రాయసేకరణకు గ్రామసభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ సహా ముఖ్య అధికారులు అక్కడికి వెళ్లారు.

ఆ సమయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలపై ఆయా గ్రామాల రైతులు కర్రలు, రాళ్లతో దాడులకు యత్నించారు.

తరువాయి పేజి 2లో

# తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్



- పరిస్థితుల కారణంగా మరోసారి పోరుబాట
- రాష్ట్ర సాధనలో కేసీఆర్ కృషి అనన్యసామాన్యం : మాజీ మంత్రి కేటీఆర్

### కేసీఆర్ గురించి ఆసక్తికర విషయాలు.. దీక్షా దివస్‌లో కేటీఆర్ వెల్లడి

- తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురించి దీక్షా దివస్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర విషయాలు తెలిపారు.
- దీక్షా దివాస్ సందర్భంగా కరీంనగర్‌లోని అల్గునూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

2లో

తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్ అనిపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా మరోసారి పోరాట బాట పట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కృషి అనన్య సామాన్యమైనదని కేటీఆర్ కొనియాడారు. కేసీఆర్ పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం కృషి చేశారని తెలిపారు. కేసీఆర్ అనేది పేరు కాదు.. తెలంగాణ పోరు అని పేర్కొన్నారు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించామని తెలిపారు. కానీ ఆనాడు ఉద్యమంలో అడ్రస్ లేని వాళ్లు ఇవాళ తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆనాడు ఉద్యమంలో మన మీదకు తుపాకీ తీసుకొచ్చినోడు ఇవాళ మాట్లాడుతున్నాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు నాంపల్లి దర్గా దగ్గర అడుక్కుతినే వాళ్లని తెలంగాణ ప్రజల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఇవాళ అదృష్టవంతుడు.. అధికారం ఆయన దగ్గర ఉందని కేటీఆర్ అన్నారు.

2లో

# సిద్దిపేటలో రాష్ట్ర సాధనలో దీక్ష చేయనవారు లేరు

**స్వాతంత్ర్యం పాల్గొన్నంత గొప్ప రాష్ట్ర సాధనలో పాల్గొంటే : మాజీ మంత్రి హరీశ్‌రావు**

- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం సిద్దిపేటలో దీక్ష చేయని మనిషే లేడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు.
- ఉద్యమాల కోట దుబ్బాక, గజ్వేల్‌లోనూ దీక్ష చేశారని అన్నారు.




2లో

సిద్దిపేటలో నిర్వహించిన దీక్షా దివాస్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డితో పాటు భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి హరీశ్‌రావు పాలాభిషేకం చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో మన భాగస్వామ్యం.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నంత గొప్పదని చెప్పారు. రేవంత్ ఏనాడైనా జై తెలంగాణ అన్నాడా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం

- సంక్షేమ హాస్టళ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు.



2లో

# తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్

మొదటి పేజీ తరువాయి

అధికారం నీ దగ్గర ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్‌కు, గులాబీ జెండాకే ఉందని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపించారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. దొంగ మాటలు, నంగనాచి కబుర్లు చెప్పి నువ్వు గెలవచ్చు కానీ.. ఏ రోజుకైనా తెలంగాణ చరిత్ర రాసిన రోజు కేసీఆర్ హిమాలయ పర్వతమంతా ఎత్తులో ఉంటే.. కనీసం ఆయన కాలి గోటికి కూడా సరిపోని పాత్రలో ఉంటావనేది అక్షర సత్యమని చెప్పారు. దమ్ముంటే నీ ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఏ ఊరికైనా, ఏ తండాకైనా, ఏ బస్తీకైనా వెళ్లమని సవాలు విసిరారు. కాంగ్రెస్ ఏడాది పాలనతో తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని కేటీఆర్ అన్నారు. ఆఖరకు గురుకులాల్లో ఉండే పిల్లలు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. హాస్టల్‌లో బువ్వ తిని ఆస్పత్రి పాలయ్యే పరిస్థితి ఉందని మండిపడ్డారు. హాస్టల్ విద్యార్థులు తిండి కోసం అలమటిస్తున్నారని అన్నారు. ఇది ఏడాది పాలనలో రాష్ట్ర పరిస్థితి అని అన్నారు. ఈ పాటి దానికి విజయోత్సవాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చే నాలుగేళ్లు ప్రజల పక్షాన ఉద్యమిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

## కేసీఆర్ గురించి ఆసక్తికర విషయాలు.. దీక్షా దివస్‌లో కేటీఆర్ వెల్లడి

మొదటి పేజీ తరువాయి

అప్పట్లో కెప్టెన్ లక్ష్మీకాంతారావు.. కేసీఆర్ ఏది చెబితే దానికి ఎస్ అనే వారు. అలా ఎందుకు అంటున్నారని నేను ఒకసారి అడిగితే చాలా ఆసక్తికర విషయం చెప్పారు. 2001లోనే కేసీఆర్ తెలంగాణ వస్తదని గట్టి చెప్పేవారు. జిల్లా పరిషత్ ఛైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, కేంద్రమంత్రులు మన వాళ్లు అవుతారని అనేవారని ఆయన నాతో చెప్పారు. ఓట్ల ద్వారానే తెలంగాణ సాధ్యమవుతుందని ఆయన చెబితే ఆయన చెప్పిందంత సినిమా లాగా ఉందని అన్నానని అన్నారు. అయితే కరీంనగర్‌లో జరిగే సింహ గర్జనకు రెండు లక్షల మంది రాకపోతే మీరు నాతో ఉద్యమంలో ఉండవద్దని కేసీఆర్ అన్నారని చెప్పారు. ఆ రోజు సభకు మేము 5 గంటలు ఆలస్యంగా వెళ్లినా సరే రెండున్నర లక్షల మంది సభకు వచ్చారని చెప్పారు. ఆనాటి నుంచి కేసీఆర్ ఏది చెప్పినా ఆయన మాటకు ఎదురు చెప్పలేదని ఆయన అన్నారని కేటీఆర్ తెలిపారు.

2009లో కేసీఆర్ ఆమరణ దీక్ష ఉద్యమ పతాక సన్నివేశంగా మారింది. ఆ తర్వాత ఐదేళ్ల పాటు తెలంగాణ కోసం కేసీఆర్ వివిధ రూపాల్లో పోరాటం చేశారు. ఉప ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మాండమైన మెజార్టీ ఇచ్చి తెలంగాణ ఆకాంక్షను చాటి చెప్పారు. ఆనాటి చరిత్ర ఇవ్వాళ్టి 18, 20 ఏళ్ల పిల్లలకు తెలియదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా చాలా మంచి పనులు చేసిందని మాత్రమే తెలుసు. కానీ కేసీఆర్ ఉద్యమ నాయకుడిగా ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చిందని వారికి తెలియాలి. ఆనాటి కేసీఆర్ స్ఫూర్తితో మళ్లీ తెలంగాణలో మరో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రూరమైన కాంగ్రెస్ పార్టీ మళ్లీ ప్రజలను మోసం చేస్తూ వికృతంగా వికట్టహాసం చేస్తోంది. కేసీఆర్ దీక్ష స్ఫూర్తిగా మళ్లీ ఒకసారి సంకల్పం తీసుకొని కాంగ్రెస్ పార్టీ మీద పోరాటం చేయాలి. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ మనం పోరాటం చేయాల్సి ఉంది. రాబోయే నాలుగేళ్లు ప్రజల కోసం పోరాటం చేద్దాం. ప్రతి వేదికలో తెలంగాణ పక్షాన పోరాడుదాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: హాస్టళ్లలోని విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. "మా ప్రభుత్వం వచ్చాక ఒక విద్యార్థిని చనిపోయింది. బాధిత విద్యార్థినికి ప్రత్యేక వైద్య సదుపాయం కల్పించాం. అయినప్పటికీ దురదృష్టవశాత్తు చనిపోయింది. ఆమె మృతిపై రాజకీయాలు చేయడం తగదు. గత ప్రభుత్వ హయాంలో హాస్టళ్లలోని భోజనంలో పురుగులు వచ్చేవి. సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాలు కొరవడినా భారాస ప్రభుత్వం పట్టించుకోలేదు. విద్యార్థిని మృతిని రాజకీయం చేయడం దురదృష్టకరం. గురుకులాల్లో కుట్రల వెనుక భారాస నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉంది. గతంలో ఆయన గురుకులాల కార్యదర్శిగా పనిచేశారు. తన అనుచరులనే సిబ్బందిగా నియమించుకున్నారు" అని కొండా సురేఖ ఆరోపించారు.

## సిద్దిపేటలో రాష్ట్ర సాధనలో దీక్ష చేయనవారు లేరు

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డిపై ఒక్క ఉద్యమ కేసైనా ఉన్నదా అని అడిగారు. తమ మీద వందల కేసులు నమోదు చేశారని తెలిపారు. ఇచ్చిన తెలంగాణ ప్రకటనను కాంగ్రెస్ సర్కార్ వెనక్కి తీసుకున్నప్పుడు ఉద్యమం ఉవ్వెత్తున మొదలైందని.. అప్పుడు ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని తెలంగాణ ప్రజలు డిమాండ్ చేశారని గుర్తుచేశారు. అప్పుడు రాజీనామా చేయకుండా రేవంత్ రెడ్డి పారిపోయిండని విమర్శించారు. ఇప్పటి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా రాజీనామా చేయలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి మీద ఉద్యమ కేసులు లేవు కానీ.. ఓటుకు నోటు కేసు మాత్రం నమోదైందని హరీశ్‌రావు అన్నారు. అలాంటి రేవంత్ రెడ్డి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తారా అని మండిపడ్డారు. తెలంగాణలో రేవంత్ రెడ్డిపై మరకలు వెంటాడుతూనే ఉంటాయని అన్నారు.

## మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానం: మంత్రి శ్రీధర్‌బాబు

మొదటి పేజీ తరువాయి




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ఇజ్రాయెల్ ముందుకు రావడం పట్ల రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ దేశ రాయబారి రువెన్ అజర్‌కు శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య పరస్పర సహకారానికి ఇజ్రాయెల్ ఆసక్తి కనబర్చడం సంతోషంగా ఉందన్నారు. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీలో ఇజ్రాయెల్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని.. ఆ రంగాల్లో తెలంగాణకు సహకరించాలని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు కోరారు. రక్షణ రంగం, వ్యవసాయం, నీటి వినియోగంలో ఆధునిక సాంకేతికత, నూతన పరిశోధనలు, పారిశ్రామిక అభివృద్ధిలో తోడ్పాటును అందించాలని మంత్రి చేసిన అభ్యర్థనకు రువెన్ అజర్ సానుకూలంగా స్పందించారు.
రాష్ట్రంలో 200 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని శ్రీధర్ బాబు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీపై అత్యాధునిక శిక్షణలో మద్దతు కావాలని కోరారు. వ్యర్థ జలాల పునర్వినియోగ సాంకేతికతలో తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని.. ఇజ్రాయెల్ నుంచి పరిశ్రమలు పెట్టేందుకు ఏ సంస్థ ముందుకొచ్చినా నైపుణ్యం కలిగిన మానవ వనరులు సిద్ధంగా ఉన్నాయన్నారు. నూతన పరిజ్ఞానం, పరిశ్రమల ఏర్పాటులో సాయపడితే తెలంగాణ నుంచే ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని మంత్రి సూచించారు.

## లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరణ

మొదటి పేజీ తరువాయి

కలెక్టర్, అదనపు కలెక్టర్ త్రుటిలో తప్పించుకోగా కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను తప్పించేందుకు యత్నించిన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిపైనా దాడి జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భారాస మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా పలువురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మరోవైపు ఈ ఘటనపై అధికార, విపక్షాల మధ్య మాటలయుద్ధం కొనసాగింది. ఈ పరిణామాల నేపథ్యంలో లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

ప్రభుత్వం మరో తీపికబురు?

లగచర్లలో ఫార్మా విలేజ్‌ల కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వేళ.. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి ప్రజలకు ప్రభుత్వం మరో తీపికబురు చెప్పింది. ఫార్మా విలేజ్ కావడంతోనే ప్రజలు వ్యతిరేకించారని.. ఇతర పరిశ్రమలైతే ప్రజలు స్వచ్ఛందంగా భూములిస్తారనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇతర కంపెనీలైతే కాలుష్యం ఉండబోదని.. యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలకు అవకాశం ఉండే విధంగా టెక్స్‌టైల్ కంపెనీలకు ప్రాధాన్యత ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

## డ్రగ్స్ కేసు.. జైల్లో ఉన్న గర్భిణికి బెయిల్

ముంబయి: డ్రగ్స్ కేసులో అరెస్టై ప్రస్తుతం విచారణ ఖైదీగా ఉన్న ఓ గర్భిణికి బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. జైలు వాతావరణంలో ప్రసవించడం అనేది తల్లితో పాటు పుట్టబోయే బిడ్డపైనా ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. ఖైదీలు కూడా గౌరవానికి అర్హులని చెప్పిన న్యాయస్థానం.. గర్భిణికి ఆరు నెలల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని గోందియా రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి దాదాపు 33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో సురభి సోని అనే మహిళ బ్యాగులో ఏడు కిలోలు లభించింది. దీంతో వీరందర్నీ అరెస్టు చేసిన అనంతరం జైలుకు తరలించారు. అయితే, పోలీసులకు పట్టుబడిన సమయంలో సోని రెండు నెలల గర్భిణీ అని తెలిసింది.
జైలు వాతావరణంలో కాకుండా ఇంటి వద్ద ప్రసవించేందుకు వీలుగా తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సోని.. హైకోర్టును ఆశ్రయించింది. అయితే, మానవీయకోణంలో బెయిల్ ఇవ్వాలని ఆమె చేసిన విజ్ఞప్తిని ప్రాసిక్యూషన్ వ్యతిరేకించింది. ఇరుపక్షాల వాదనలు విన్న నాగ్‌పూర్ బెంచ్.. జైల్లో జన్మనివ్వడం అనేది తల్లితోపాటు బిడ్డపైనా ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. ఈ క్రమంలో విచారణ ఖైదీగా ఉన్న సోనికి ఆరు నెలలపాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది.

## బాలానగర్ సీతాఫలానికి భౌగోళిక గుర్తింపుపై గురి



### త్వరలో దరఖాస్తుకు ఉద్యాన వర్సిటీ కసరత్తు

హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో పండే సీతాఫలం భౌగోళిక గుర్తింపు(జీఐ) కోసం దరఖాస్తు చేయాలని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నిర్ణయించింది. దీని కోసం ఇప్పటికే అధ్యయనాలు చేపట్టి గణాంకాలు సేకరిస్తుండగా.. ఈ ప్రాజెక్టు కోసం జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రూ.12.70 లక్షల సాయం అందించేందుకు ముందుకొచ్చింది. బాలానగర్ అడవుల్లో పుట్టిన సీతాఫలం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు విస్తరించింది. ఆగస్టు చివరి నుంచి నవంబరు చివరి వరకు ఇది ఆ ప్రాంతాల్లోని ప్రజలకు, ప్రధానంగా గిరిజనులకు ఉపాధి కల్పిస్తుంది. రుచి, నాణ్యతకు పేరొందిన బాలానగర్ సీతాఫలాలు తెలంగాణ రాష్ట్రంతోపాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. అయితే, విస్తృత ప్రాచుర్యం పొందిన వీటికి పోటీగా హైబ్రిడ్ పండ్లు మార్కెట్లోకి వస్తుండడంతో బాలానగర్ ఫలాల విశిష్టతను కాపాడుకునేందుకు జీఐకి దరఖాస్తు చేయాలని ఉద్యాన విశ్వవిద్యాలయం సంకల్పించి అందుకు అవసరమైన కసరత్తు చేపట్టింది. బాలానగర్ సీతాఫలానికి భౌగోళిక గుర్తింపు వస్తే ఈ రకానికి చట్టబద్ధ రక్షణ కలుగుతుందని తెలంగాణ ఉద్యాన వర్సిటీ వీసీ దండా రాజిరెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్‌ను అవే దెబ్బకొట్టాయ్.. ఇలాగైతే కష్టమే!: ఖర్గే కీలక వ్యాఖ్యలు

దిల్లీ: మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని దెబ్బ తగలడంపై కాంగ్రెస్ లోతుగా విశ్లేషిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం దిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అంచనాలను అందుకోలేని రీతిలో ఉన్న పనితీరే పార్టీకి పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు. పార్టీలో ఐక్యత లేకపోవడం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వంటివి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బకొట్టాయని, ఈ విషయంలో కఠిన క్రమశిక్షణ అవసరమన్నారు. కలిసికట్టుగా పోరాడకుండా, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటుంటే ప్రత్యర్థులను ఎలా ఓడించగలం? అని ప్రశ్నించారు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమన్న ఖర్గే.. ఈ ఫలితాల నుంచి ఇప్పటికైనా పాఠాలు నేర్చుకోవాలని పార్టీ నేతలకు సూచించారు.

క్రమశిక్షణే ఆయుధం

"పార్టీలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. ఎట్టి పరిస్థితుల్లో అందరం ఐక్యంగా ఉండాలి. ఇదే మన ఆయుధం. పార్టీ విజయమే తమ గెలుపు అని ప్రతిఒక్కరూ అనుకోవాలి. పార్టీ బలంపైనే మన శక్తి ఆధారపడి ఉంటుందని భావించాలి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పనితీరుతో నూతనోత్సాహంతో పునరాగమనం చేసింది. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాత్రం పార్టీ ఆశించినట్లుగా లేవు. 'ఇండియా' కూటమి పార్టీలు నాలుగు రాష్ట్రాలకు గాను రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. కానీ మన పనితీరు ఆశించిన విధంగా లేదు. ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారతుంది"

**ఈవీఎంలతో ఎన్నికల ప్రక్రియ అనుమానాస్పదం!**

"సమయానుకూలంగా వ్యూహరచన చేసి పార్టీని బలోపేతం చేసేందుకు నేతలంతా మరింతగా కష్టపడాలి. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు నుంచే సిద్ధం కావాలి. ఓటర్ల జాబితాలను పరిశీలించాలి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేలా ఈసీ వ్యవహరించాలి. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీకూటమి సాధించిన ఫలితాల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు చూసి రాజకీయ విశ్లేషకులు కన్‌ఫ్యూజన్‌లో ఉన్నారు"

**ఈ ఫలితాలు మనకు కుదుపే..**

"ఎన్నికల వ్యూహాన్ని కాంగ్రెస్ మెరుగుపరుచుకోవాలి. క్యాంపెయిన్‌ను మెరుగుపరిచేందుకు, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడానికి మెరుగైన మార్గాలను అభివృద్ధి చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ప్రజల ఎజెండాను అమలు చేసేందుకు కాంగ్రెస్ అధికారంలోకి రావడం చాలా ముఖ్యం. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు మాకు పెద్ద కుదుపే. ఇందుకు కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఫలితాలతో నిరాశ చెందడం కాకుండా.. పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి ఏఐసీసీ వరకు మార్పులు తీసుకురావాలి" అని ఖర్గే సూచించారు.




## బిజెపి పనితీరుతో వణుకుతున్న

# లెఫ్ట్ ఏకో సిస్టం

### ప్రత్యేక వ్యాసం

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

**- నిన్న ఇండియన్ ఎక్స్ ప్రెస్ దినపత్రికలో శ్రీ సుహాస్ పార్శీకర్ ఒక ఆర్టికల్ ప్రచురించాడు.**
**- భారత సమాజం మెల్ల మెల్లగా బిజెపి పార్టీ సొసైటీ గా మారుతున్నదని వాపోయాడు.**
**- రాజనీతి శాస్త్రంలో పార్టీ సొసైటీ అనేది ఒక అధ్యయన అంశం.**




సహాస్ పార్శీకర్ వామపక్ష దళాలకు మేధో సరుకును అందించే వ్యక్తుల దళ సభ్యుడని ఆప్ కీ అక్బార్ ఎడిటర్ శ్రీ ప్రదీప్ సింగ్ ఒక వీడియో ప్రజెంటేషన్ లో వ్యాఖ్యానించారు.
ఇతడు బిజెపి ఆర్ ఎస్ ఎస్ లను అదే పనిగా విమర్శించే కార్యక్రమంలో మునిగి తేలుతాడని, ఇంకా చెప్పాలంటే హిందుత్వ వ్యతిరేకి అని అన్నారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ప్రభ తగ్గిందని ఇక భారత్ లో హిందూ శక్తుల క్షీణ దశ ప్రారంభమయ్యింది అని సంబరాలు చేసుకున్న ముఠాలకు ఆలోచనా చమురు అందించే కార్యక్రమానికి చేయూత అందించిన సుహాస్ పార్శీకర్ ఆనందం మూన్నాళ్ళ ముచ్చట అయ్యిందని తన బాధను తన ఆర్టికల్ ద్వారా వెళ్లగక్కారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసి శాసన సభల ఎన్నికలు జరిగిన ఈ 6 నెలల సమయంలో బిజెపి మ్యాజిక్ జరిగిందని అన్నారు. 14 శాతం ప్రతిపక్షాల ఓట్లు తన ఖాతాలో వేసుకొని భారత రాజకీయ ముఖ చిత్రాన్ని బిజెపి మార్చివేసింది అని సుహాస్ తన వ్యాసంలో వాపోయారు. బిజెపి ఆర్ ఎస్ ఎస్ ను అకారణంగా వ్యతిరేకించే పార్శీకర్ మహారాష్ట్రలో బిజెపి అఖండ విజయంతో లెఫ్ట్ ఏకో సిస్టం ఆందోళనకు గురయ్యిందని ప్రదీప్ సింగ్ అన్నారు. బిజెపి ఆర్ ఎస్ ఎస్ స్థిర విజయాలతో మొదటి సారి లెఫ్ట్ లిబరల్ ఏకో సిస్టం భయపడుతున్నదని ప్రదీప్ సింగ్ అన్నారు. బిజెపి విజయాలతో దేశ అంతర్గత భారత వ్యతిరేక శక్తుల మనోబలం జారిందని పార్శీకర్ వ్యాసం పట్టి చూపుతున్నదని ప్రదీప్ సింగ్ అన్నారు. హర్యానా మహారాష్ట్ర ఎన్నికల్లో లెఫ్ట్ మార్గదర్శనం విఫలమయిందని అన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభావం తగ్గిందని, 1985 వరకు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ప్రధాన రాష్ట్రంలో బిజెపి పాగా వేసిందని అన్నారు. కర్నాటక తెలంగాణ లో పాలక పార్టీల వ్యతిరేక ఓటుతో అధికారం పొందిన కాంగ్రెస్ సంస్థాగతంగా బలంగా లేదని సుహాస్ పార్శీకర్ నిన్నటి వ్యాసంలో బలహీన స్వరంతో అయినా స్పష్టంగా తన బాధను వినిపించారు. 1999 లో మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ చీలిపోయిన తర్వాత మళ్ళీ పుంజుకోలేక పోతున్నదని పార్శీకర్ తన వ్యాసంలో వ్యాకులత చెందడం లెఫ్ట్ ఏకోసిస్టం యొక్క మానసిక స్థితిని తెలుపుతున్నదని ప్రదీప్ సింగ్ అన్నారు. 1999 లో కాంగ్రెస్ నుండి చీలిపోయిన శరద్ పవార్ ఎన్సిపి పార్టీతో 15 ఏళ్ళు అధికారం పంచుకున్న కాంగ్రెస్ తన ముద్రను కోల్పోయిందని పార్శీకర్ వ్రాసారు. శివసేన తో కలిసి ఒకసారి, విడిపోయి ఒకసారి బిజెపి మహారాష్ట్రలో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఎదిగిందని వాపోయిన పార్శీకర్ ఇక బిజెపి జైత్ర యాత్రను ఆపడం కష్టమని రాసారు. బిజెపి ఒంటరిగా 122 సీట్లకు ఎదగడం ఓర్చుకోలేని బిజెపి వైరి పక్షాలు స్వాభిమానం చంపుకొని ఒక్కటయ్యాయని, 2019లో బిజెపి శివసేన కూటమి మెజారిటీ సాధించినా, బిజెపికి అధికారం దక్కనివ్వకుండా మహా వికాస్ అఘాడీ ఏర్పాటు చేసుకున్నప్పటికీ అది మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే అయ్యిందని. ముందుకంటే అధికంగా 10 సీట్లు ఎక్కువ సాధించిన బిజెపి ఎత్తులకు పై ఎత్తులతో అజేయంగా ఎదిగిందని పార్శీకర్ లెఫ్ట్ ఏకో సిస్టం ఆందోళనను వ్యక్తపరిచారు. అఘాడీ ని ముక్కలు ముక్కలు చేసి బిజెపి ఎన్నికల గోదాలో విజృంభించింది అని పార్శీకర్ వాపోయారు. బిజెపి ఎదుగుదలను ఆపడం కష్టమని, రాష్ట్ర స్థానిక సమస్యలను అధిగమించి బిజెపి తన వ్యూహాలతో దేశంలోని అన్ని మూలలకు వ్యాపించిందని రాసారు. తెర చాటు కుట్రలకు పేరొందిన లెఫ్ట్ ఏకో సిస్టం బీజేపీని ఎలా నిలువరించాలో తెలియక ఆందోళన చెందడం స్పష్టంగా కనిపిస్తున్నదని శ్రీ ప్రదీప్ సింగ్ అన్నారు. లెఫ్ట్ థింక్ టాంక్ ఆందోళన చెందడం మొదటిసారి కనిపిస్తున్నదని శ్రీ ప్రదీప్ సింగ్ విశదీకరించారు.

## మేడ్చల్ హాల్చల్ బిఆర్ఎస్ దీక్షాదివస్ వేడుకలు





**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి మేడ్చల్**

తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను రగిలించిన కేసీఆర్ చేపట్టిన 11 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 15 సం.లు పూర్తయిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ, తెలంగాణ వ్యాప్తంగా తెలంగాణ దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. 29 నవంబర్ 2009 రోజున కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష తెలంగాణ ఉద్యమ లక్ష్యాన్ని నెరవేర్చింది. అన్ని వర్గాల, అన్ని సంఘాల,అసంఖ్యాక తెలంగాణ ప్రజల పట్టుసడలని సంకల్పాన్ని రగిలించిన రోజు,ఉద్యమ సాఫల్యతకు ఆశలు తొడిగిన రోజు నవంబర్ 29 అని బి ఆరె ఎస్ శ్రేణులు నిన్న సంబరాలు జరుపుకున్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ లోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో వేలాది కార్యకర్తలు నాయకులు ఉద్యమ జ్ఞాపకాలను పంచుకుని పరస్పరం అభినందనలు చెప్పుకున్నారు. మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ స్వామి గౌడ్ పర్యవేక్షణలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పార్టీ అధ్యక్షులు శంబిపుర్ రాజు గారి అధ్యక్షతన దీక్షా దివాస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు చామకుర మల్లారెడ్డి గారు, కేపీ వివేకానంద్ గారు, మాధవరం కృష్ణారావు గారు, బండారి లక్ష్మారెడ్డి గారు, మర్రి రాజశేఖర్ రెడ్డి గారు, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి గారు, నందికంటి శ్రీధర్ గారు, జహంగీర్ పాషా గారు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి గారు సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, మహిళ నాయకురాళ్ళు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ నవంబర్ 29 రోజు అంటేనే తెలంగాణ చరిత్రను మలుపుతిప్పిన ఈరోజు చరిత్రలో నిలిచిపోయింది అని అన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అని నినాదమిచ్చి రాష్ట్ర సాధన కోసం మృత్యువును సైతం ముద్దాడేందుకు కేసీఆర్ గారు తెగించిన రోజు నేడు. కోట్లాది మంది ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు.. కేసీఆర్ గారు తన ప్రాణాలను సైతం పణంగా పెట్టేందుకు సిద్దమైన రోజు ఇది అని అన్నారు తెలంగాణ జాతిపిత, ఉద్యమ నేత కేసీఆర్ గారి పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ యావత్ ప్రజానీకాన్ని జాగృతం చేస్తూ,ఈ రోజు నిర్వహించిన 'దీక్షా దివస్' లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## డిసెంబర్ 13న అరుణాచల వెళ్లే యాత్రికులకు శుభవార్త.

**... నాలుగు రోజుల అరుణాచలం గిరి ప్రదక్షణ యాత్ర.**
**..మెట్ పల్లి డి. ఎం. దేవరాజు.**

**కరుణాకర్ మెట్ పల్లి, నవంబర్ 29.**
మెట్పల్లి పట్టణం పరిసర ప్రాంతాల ప్రజలకు యాత్రలకు వెళ్లే వారికి టి జి ఎస్ ఆర్ టి సి మెట్పల్లి డిపో నుండి డిసెంబర్ 13న నఅరుణాచలం గిరిప్రదక్షిణ కొరకు ఆర్టీసీ కొత్త బస్టాండ్ నుండి బయలుదేరునని డిపో మేనేజర్ దేవరాజు రణం ప్రతినిధితో అన్నారు. మెట్ పల్లి నుండి కాణిపాకం, వెల్లూరు, అరుణాచలం, జోగిలాంబ దేవాలయాలను చూపించబడునని అన్నారు . బస్సు చార్జీ పెద్దలకు 5000 రూపాయలు, పిల్లలకు 4000 రూపాయలు తీసుకోబడునని అన్నారు . యాత్రకు వచ్చే ప్రయాణికులు టికెట్ రిజర్వేషన్ కొరకు, పూర్తి వివరాల కొరకు ఈ సెల్ నెంబర్లలో9948941541,7382850971,9154298574, 9533006606 సంప్రదించగలరని డి.ఎం .దేవరాజు అన్నారు. మెట్పల్లి నుండి 13న బస్సు కోరుట్ల ,కరీంనగర్ మీదుగా వెళ్లి 14వ తేదీ ఉదయం ఏడు గంటలకు కాని పాకం, సాయంత్రం ఐదు గంటలకు వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్ ను అనంతరం 15వ తేదీ పౌర్ణమి రోజున అరుణాచలం చేరుకుంటుందని అన్నారు. గిరి ప్రదక్షణ అయిన తరువాత 15వ తేదీ ఆదివారం సాయంత్రం బయలుదేరి 16వ తేదీ సోమవారం జోగులాంబ అమ్మవారి శక్తి పీఠం దర్శనం చేసుకున్న తర్వాత అదే రోజు ప్రయాణికులను తిరిగి మెట్పల్లిలో సాయంత్రం 6 గంటల వరకు వదిలిపెడుతుందని డిఎం దేవరాజు అన్నారు. దైవ దర్శనం, అల్పాహారం, భోజనం ఖర్చులు ప్రయాణికుల భరించుకోవాలని తెలిపారు. ఆసక్తిగల వారు కొన్ని సీట్లు ఉన్నందున ఎవరు మొదలు బుక్ చేసుకుంటే వారికి సీటు లభిస్తుందనిఅన్నారు. తొందరగా ఆన్లైన్లో బుక్ చేసుకోవాలని లేదా బస్ కౌంటర్లో వచ్చి నేరుగా చేసుకోవచ్చని తెలిపారు.

## విలేకర్ల పేరుతో బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

**కరుణాకర్ న్యూస్ మెటపల్లి: నవంబర్ 29**
మెట్ పల్లి పట్టణంకు చెందిన గుండమీద శేఖర్, కార్తీక్ అనే ఇద్దరు నకిలీ విలేకరులను శుక్రవారం అరెస్ట్ చేసినట్టు సిఐ నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే మెట్ పల్లి నుండి మల్లాపూర్ మండలం సాతారం కు చెందిన చౌడరపు రమణ ఈ నెల 24 వ తేదీన తన కారులో కిరాణ సామాను తరలిస్తున్న క్రమంలో వెంపేట శివారులో శేఖర్ కారులో వచ్చి రమణ కారును అడ్డుగా పెట్టి వేయడం జరిగిందని, అంతే కాకుండా రమణ ను నీ కారులో నకిలీ వస్తువులు సరఫరా చేస్తున్నావని బెదిరించినట్లు పిర్యాదులో తెలిపారు. అదేవిదంగా పోలీసు స్టేషన్ కు వెళ్దామంటూ, కారు ను వెనక్కి తిప్పి మెట్ పల్లి తీసుకురాగ,



మెట్ పల్లిలో కార్తీక్ అనే మరో నకిలీ విలేకరి వద్ద ఆగడం జరిగిందని వెల్లడించారు. అనంతరం శేఖర్,కార్తీక్ లు తిరిగి కారులో వెంపేట శివారు కారులో వచ్చి 10 వేల రూపాయలు డిమాండ్ చేసినట్టు వెల్లడించారు. అంతేకాకుండా రమణ మొబైల్ తీసుకుని ఫోన్ పే ద్వారా 4000 రూపాయలను నకిలీ విలేకరులు పంపించుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వీరి ఇరువురు ఈ విషయాన్ని ఎవరికన్నా చెబితే చంపివేస్తామని బెదిరింపులకు పాల్పడినట్టు బాధితుడు వెల్లడించాడు. బాధితుడు ఇట్టి విషయాన్ని తన భార్య స్నేహితులతో చెప్పగా శుక్రవారం ఉదయం మెట్పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు కార్తీక్, శేఖర్ల ను మెట్పల్లి చివరలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద అరెస్టు చేసి విచారించగ నిజం ఒప్పుకున్నట్లు తెలిపారు. యూట్యూబ్ ఛానల్లు నడిపిస్తూ అమాయక ప్రజలను బెదిరింపులకు పాడుతున్నందున అరెస్టు చేసే రిమాండ్ కు పంపించినట్లు పంపించినట్లు సిఐ పేర్కొన్నారు. వ్యాపారులను విలేకరులమంటూ బెదిరింపులకు పాల్పడితే పోలీస్ శాఖ వారికి తెలియజేయాలి అని కోరారు.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చాలి

**- తహశీల్దార్ కు వినతి పత్రం అందజేసిన మండల బిజెపి నాయకులు**

**కరుణాకర్ ఎండపల్లి ప్రతినిధి,**
మండల బిజెపి నాయకులు ఆద్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫ్యల్యాల గురించి తహశీల్దార్ రవికాంత్ కి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు ఇచ్చినటువంటి హామీలు అయినా 2 లక్షల రుణ మాఫీ,రైతు భరోసా 15000,రైతులకు, కౌలు రైతులకు ,వ్యవసాయ కూలీలకు 12000, సన్న వరి పంటకు 500 బోనస్, వికలాంగులకు 6000 పెన్షన్,వృద్ధాప్య పెన్షన్ 4000,కళ్యాణలక్ష్మి పథకం తో పాటు తులం బంగారం,మహాలక్ష్మి పథకం క్రింద ప్రతి నెల ప్రతి మహిళకు 2500,ఇందిరమ్మ ఇల్లు లాంటి హామీలు, ఇచ్చి ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఇంకోమాట అన్నట్లు అమలుకు సాద్యం కాని అడ్డగోలు హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని భారతీయ జనతా పార్టీ తరపున ప్రభుత్వాన్ని బిజెపి మండల నాయకులు కోరుతున్నారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రావు హోన్మంతరావు,అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు,ప్రధాన కార్యదర్శులు పొన్నం నరేష్, మంచికట్ల,రవి,ఓబీసీ అధ్యక్షులు అమర గొండ దివాకర్ గౌడ్ ,బిజె వైఎం అధ్యక్షులు సాగర్ యాదవ్ గుల్లకోట బూత్ అధ్యక్షులు పోన్నం కిరణ్ గౌడ్,సినియర్ కార్యకర్తలు సిగిరి ఆనండ్, మూల ప్రశాంత్ గౌడ్, గొల్లపల్లి రాం చరణ్,కార్యకర్తలు పాల్గొన్నారు
సిఎం ప్రోగ్రాం సందర్బంగా ముందస్తు చర్యలు

## దీక్ష దివాస్ కార్యక్రమానికి బయలుదేరిన బిఆర్ఎస్ శ్రేణులు



**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**
మెదక్ జిల్లా నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బి ఆర్ఎస్ నాయకులు మెదక్ జిల్లాలో జరిగిన దీక్ష దివాస్ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు అనంతరం మెదక్ జిల్లాలో జరిగే దీక్ష శిబిరానికి భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఇక కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, సత్యం గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

## నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య



**కరపత్రం ప్రతినిధి మెదక్ నర్సాపూర్.**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ గ్రామంలో ఇంటి బాత్రూం లో ఉరి వేసుకున్న ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య గతంలో తలకు గాయం కాగా నొప్పులు భరించలేక ఉరి వేసుకున్న స్వామి ప్రతి 18 సంవత్సరాలు తండ్రి కృష్ణ పోలీస్ శాఖ తెలుపగా పోలీస్ శాఖ వారుదర్యాప్తు చేస్తున్నారు.

## హామీలకే పరిమితమైన బిఆర్ఎస్ ప్రభుత్వం.

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**



మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్ లో గల రాయరావు చెరువును మినీ ట్యాంక్ బండ్ చేస్తామన్నారు బి ఆర్ ఎస్ హయాంలో రాష్ట్రంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి అందులో ఉన్న కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్నారు అప్పటి మినిస్టర్ ప్రస్తుత ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వాలీబాల్ టోర్నమెంట్ పెట్టి మినీ స్టేడియం చేస్తామన్నారు నర్సాపూర్ మరియు మెదక్ జిల్లాలో ఉన్న డబుల్ బెడ్రూంలో శిథిలావస్థకు చేరుతున్నాయి అన్నారు అప్పటి గవర్నమెంట్ 10 సంవత్సరాల హయాంలో చేయలేకపోయింది అని అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా రైతుల పండుగ

**– శ్రీమతి చంద్రకళ జిల్లా వ్యవసాయ అధికారి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా**

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.**
రాష్ట్ర ప్రభుత్వం ఒక సంవత్సర పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతు పండుగని జరపడానికి నిర్ణయించారు. ఈ సంవత్సర కాలంలో ప్రజా ప్రభుత్వం రైతులకు రూపాయలు 50 వేల కోట్లకు పైగా రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోలు, సన్న వడ్లకు బోనస్, రైతు బీమా తదితర పథకాల ద్వారా అందించడం జరిగింది. ఈ సందర్భంగా అనగా 30.11.2024 నాడు అమిస్తాపూర్, మహబూబ్ నగర్ నందు జరిగే రైతు బహిరంగ సభను ఉద్దేశించి గౌరవ ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ బహిరంగ సభకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నుండి భారీ స్థాయిలో రైతులు పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి. దీనిపై ముడు చింతలపల్లి, అలియాబాద్, కీసర రైతు వేదికల వద్ద, మేడ్చల్ మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద మరియు ఎదులాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు బయలుదేరును. దీనిని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోగలరని మనవి. అదేవిధంగా ముఖ్యమంత్రి సభని ముడు చింతలపల్లి, అలియాబాద్, (షామీర్పేట), కీసర, ప్రతాప్సింగారం, (ఘట్కేసర్), రాయలా పూర్ (మేడ్చల్) రైతు వేదికల వీడియో కాన్ఫరెన్స్ సెట్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయబడును. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సోదరులు పాల్గొని విజయవంతం చేయగలరని శ్రీమతి చంద్రకళ,జిల్లా వ్యవసాయ అధికారి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా. వారు తెలిపారు.

## టీజీవో జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్. రామ్మోహన్...

**– అభినందించిన జిజేసి వీణవంక అధ్యాపక బృందం..**

**కరపత్రం ప్రతినిధి, కరీంనగర్/వీణవంక,నవంబర్ 29.**



కరీంనగర్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలు 28 నవంబర్ 2024గురువారం రోజున కరీంనగర్ టీఎన్జీవోభవన్లో నిర్వహించనైనది. ఇట్టి ఎన్నికల్లో వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రంథపాలకుడు ఎన్. రామ్మోహన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నిక కాబడినారు. ఇటు ఎన్నికైన సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కే రాజిరెడ్డి, అధ్యాపకులు చిట్టి మల్ల భాస్కర్, జైపాల్ రెడ్డి కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియపరిచారు. ఇట్టి ఎన్నికలలో సహకరించిన రాష్ట్ర టీజీవో అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ కి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్ రావుకి జిల్లా టీజీవో అధ్యక్షుడు కాళీ చరణ్ కి కృతజ్ఞతలు తెలియపరిచారు.

# ఆర్.ఎం.పి, పి.ఎం.పి, వైద్యులపై జిల్లా ఉన్నతాధికారుల వేధింపులు మానుకోవాలి

**– గ్రామాలలో రాత్రింబగళ్లు ప్రజలకు అందుబాటులో ఆర్ఎం పి, పి.ఎం.పి వైద్యులు**
**– ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు వైద్య సేవలు శూన్యం**
**– ఆర్.ఎం.పి, పి. ఎం. పి. వైద్యులకు ప్రభుత్వం ద్వారా భరోసా కల్పించాలి**
**– తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నత అధికారుల కు విజ్ఞప్తి చేసిన**
**– జిన్నారం గ్రామ ఫోటోగ్రఫీ, యువజన నాయకుడు, దన్నారం బాలా గౌడ్**



దన్నారం బాలగౌడ్
ఫోటోగ్రాఫిస్ట్, సామాజిక సంఘ

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.**
సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రం జిన్నారం గ్రామానికి చెందిన దన్నారం బాలా గౌడ్ ఫోటోగ్రాఫిస్ట్, సామాజిక యువజన నాయకుడు పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కానీ వివిధ మండలాల్లో కానీ తరచూ ఆర్.ఎం.పి, పి.ఎం.పి. వైద్యుల పైన ఆంక్షలు విధిస్తూ విచారణ పేరిట ఆర్.ఎం.పి, పి. ఎం. పి. వైద్యులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని, ప్రభుత్వ ఆసుపత్రిలు ఉన్నప్పటికీ అరకురా వైద్య సేవలను అందిస్తూ అర్ధరాత్రి డ్యూటీ డాక్టర్స్ లేకుండా వైద్యం చేయడంలో నిర్లక్ష్యం జరిగే పరిస్థితులు గతంలో నెలకొనడం జరిగింది నేటికి కూడా కొనసాగుతున్నాయి, అటువంటి తరుణంలో ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యులు అతి తక్కువ డబ్బులు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడమే వాళ్ళు శ్రేయస్సుగా పనిచేస్తు గ్రామీణ ప్రజలకు అర్ధరాత్రి అస్వస్థకు గురైతే లేవలేని పరిస్థితిలో వారికి ఇంటికెళ్లి ప్రాథమిక వైద్యం అందించి ప్రజల ప్రాణాలు రక్షిస్తున్నారు,ఇంతటి సేవలందిస్తున్న గ్రామీణ ప్రాంత పి.ఎం.పి, ఆర్ఎంపీ, ప్రభుత్వం భరోసాను కల్పించి వారి ప్రాథమిక వైద్య కేంద్రాల పైన దాడులను ఆపి, ఆర్.ఎం.పి పి.ఎం.పి వైద్యులకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక గుర్తింపునిస్తూ వారి సంక్షేమం కొరకు, ప్రభుత్వాలు వారు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వానికి సహకరించేందుకు ప్రభుత్వపరమైనటువంటి ఉద్యోగాలు కూడా ఇవ్వాలని, వారికి క్లినిక్స్ కొనసాగించుటకు అనుమతులు ఇవ్వాలని, వారికి ప్రత్యేక నిధిని ప్రభుత్వం కేటాయించి ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని జిన్నారం మండల కేంద్రం నుండి జిన్నారం మండల గ్రామ ప్రజల తరపున యువజన సంఘాల తరపున ప్రభుత్వాన్ని కోరుతున్న అన్నారు.

# దీక్ష దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు.

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**
తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా అందరిని ఏకం చేస్తూ కెసిఆర్ గారు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజు నవంబర్ 29, 2009 తేదిని గుర్తు చేసుకుంటూ మెదక్ జిల్లా బీ.అర్.ఎస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన "దీక్ష ధివస్" కార్యక్రమం లో నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మరియు జిల్లా ప్రజా ప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్లోల్ల శశిధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉమ్మన్న గారి దేవేందర్ రెడ్డి కంటా రెడ్డి తిరుపతి రెడ్డి , భట్టి జగుపతి,చంద్రాగౌడ్, మామిళ్ళ ఆంజనేయులు బి.అర్.ఎస్ రాష్ట్ర సీనియర్



నాయకులు పాల్గొన్నారు నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో..' అనే నినాదంతో తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్రాన్ని సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. నాడు కేసీఆర్ తన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా దీక్షా దివస్ పేరుతో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతోనే నాటి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని జ్ఞప్తికి



తెచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని చేపట్టి రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని వివరించారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదే కాదని ఆమె అన్నారు,తెలంగాణ జాతిపితగా నిలిచిన కేసీఆర్ను ఇప్పటి సీఎం రేవంత్రెడ్డి చులకన చేసి మాట్లాడడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా బి.అర్.ఎస్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు,బి.అర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన నిర్వహకులకు అవగాహన...

**– వీణవంక ఎంఈఓ శోభారాణి..**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, నవంబర్ 29.**
వీణవంక మండల కేంద్రంలో శుక్రవారం జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో మండల పరిధిలోని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీణవంక ఎంఈఓ శోభారాణి హాజరయ్యారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ... మధ్యాహ్న భోజనం శుచి, శుభ్రతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, కూరలు వండేటప్పుడు ,



కూరగాయలను ఉప్పు నీటిలో కడగాలని, అన్నం వండేటప్పుడు బియ్యాన్ని సరిగా చూసుకోవాలని, విద్యార్థులకు మంచి భోజనాన్ని అందిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననాలు పొందాలన్నారు. ప్రతి పాఠశాలలో భోజనం ఇంట్లో వండినట్లుగా ఉండాలన్నారు. కచ్చితంగా ప్రతిరోజు మెనూను పాటించాలన్నారు. నిబంధనలను పాటించని మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు పులి అశోక్ రెడ్డి, కేజీబీవీ వీణవంక స్పెషల్ ఆఫీసర్ సునీత, మధ్యాహ్న భోజన నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు గారి ఆదేశాలతో రామగిరి ఖిల్లా ను సందర్శించిన దేవాదాయ శాఖ అధికారులు

**కరపత్రం ప్రతినిధి, నవంబర్ 29.**



తెలంగాణ రాష్ట్ర ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రివర్యులు శ్రీ దుద్దిల్లశ్రీధర్ బాబు గారు రామగిరిఖిల్లాను పర్యాటక కేంద్రం ఏర్పాటు చేసి అభివృద్ధికి ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి వెను వెంటనే మంత్రి ఆదేశానుసారం దేవాదాయ శాఖ అధికారులు ఖిల్లాను సందర్శించి ఇక్కడి కట్టడాలు శ్రీ రామచంద్రుని ఆలయం. ఆంజనేయస్వామి ఆలయలను సందర్శిచారు ,
అధికారులు సుమారు 4కిలోమీటర్ల మేర నడుచుకుంటూ సర్వే నిర్వహించి క్షేత్రానికి కావాల్సిన సదుపాయాల గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు సంతోష్ రెడ్డి,స్థపతి వెంకటేశ్వర్లు,ఆలయ పూజారి సత్యనారయణ చార్యులు వారితో పాటు మాజీ zptc గంటా వెంకటరమణ రెడ్డి మంథని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బర్ల శ్రీనివాస్, రామగిరి మండల కాంగ్రెసు పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్, మంథని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్, పన్నూరు గ్రామ శాఖ కాంగ్రెసు అధ్యక్షులు గాజుల శ్రీనివాస్ గౌడ్,లు పాల్గొన్నారు.

## 'చలో హైదరాబాద్ మాలల సింహగర్జన' పోస్టర్లు ఆవిష్కరణ....



**కరపత్రం రామగిరి ప్రతినిధి, నవంబర్ 29.**
రామగిరి మండల కేంద్రంలో చలో హైదరాబాద్ "మాలల మహా సింహ గర్జన" కరపత్రం విడుదల చేశారు. రామగిరి మండల కేంద్రంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు ఎస్సీ ఉప వర్గీకరణ ను వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఈ మాలల ఆత్మీయ మహా సభకు ప్రతి ఒక్క మాల కంకణబద్ధులై తమ గురుతర భాద్యతను నిర్వహించేందుకు కలిసికట్టుగా ఉంటాము అని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సాక్షిగా రామగిరి మండలం, కమాన్ పూర్ మండలం మాల నాయకులు కలిసికట్టుగా ప్రమాణం చేస్తూ "మాలల మహా సింహ గర్జన" కర పత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగిరి మండల మాల నాయకులు కాటం సత్యం, ఎరుకల ఓదెలు, రాసురి పెంటయ్య, ఎరుకల మనోహర్, జంజర్ల సంతోష్, రాంనగర్ శంకర్, మాణిక్యం మరియు కమాన్ పూర్ మండల మాల నాయకులు భూపెల్లి మల్లేష్, దాసరి రామస్వామి, దాసరి రాంచందర్, గంట శ్రీనివాస్ మంథని మండల నాయకులు కొవ్వూరి వేణు ప్రసాద్, ఆర్ల జ్ఞాని, జంజర్ల సుదర్శన్, నూకల సురేందర్, రావుల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.